
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 16 । జూన్ । 2025



సోమశిలలో 37.940 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారం నాటికి 37.490 టీఎంసీలు ఉన్నాయి. పెన్నార్ డెల్టాకు 3,880, ఉత్తర, దక్షిణ కాలువలకు 1075 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,02,910
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,320
3 శాతం జీఎస్టీతో	రూ.9,600
నవర (8 గ్రా)	రూ.76,800

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
37.0 /28.8

జిల్లాలో సోమవారం ఆకాశం మేఘావృతమై అక్కడక్కడ జల్లులు పడవచ్చని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ ఆదివారం 52 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా శేష వాహనోత్సవం



శేష వాహనంపై కోటేశ్వరస్వామి

సంగం:మండలంలోని దువ్వూరులోని గంగా పార్వతి సమేత కోటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం అర్ధరాత్రి స్వామివారు శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. దేవదేవేరులను శేష వాహనంపై కొలువుదీర్చి పూలతో విశేషంగా అలంకరించి గ్రామోత్సవం జరిపారు. బలిజ సంఘం వారు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

కాకాణి కేసుల్లో యాంటిసిపేటరీ బెయిల్ పిటిషన్ దాఖలు

నెల్లూరు (లీగల్): మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై పోలీసులు పలు అక్రమ కేసులను బనాయించారు. కనుపూరు చెరువులో మట్టిని కాకాణి తన మనుషుల ద్వారా అక్రమంగా తరలించినట్టు వెంకటాచలసత్రం పోలీసులు క్రైమ్ నంబర్ 103/2025తో అక్రమ కేసు నమోదు చేశారు. ఈ కేసులో గోవర్ధన్‌రెడ్డి తరుపున సీనియర్ న్యాయవాదులు రామిరెడ్డి రోజారెడ్డి, సిద్దన సుబ్బారెడ్డి నెల్లూరు నాల్గో అదనపు జిల్లా కోర్టులో యాంటిసిపేటరీ బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. అలాగే అసోసియేషన్ పేరిట చెక్‌పోస్ట్ పెట్టి తన అనుచరుల ద్వారా వాహనాల యాజమానుల నుంచి అక్రమ పద్ధతిలో నగదు వసూలు చేశారని ముత్తుకూరు పోలీసులు కాకాణిపై క్రైమ్ నంబర్ 167/2025తో మరో అక్రమ కేసు నమోదు చేశారు. ఈ కేసులో కాకాణి తరపున సీనియర్ న్యాయవాదులు రామిరెడ్డి రోజారెడ్డి, సిద్దన సుబ్బారెడ్డి నెల్లూరు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టులో యాంటిసిపేటరీ బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ రెండు కేసులు సోమవారం విచారణకు రానున్నాయి.

వెంకటంపేటలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం



దుండగులు ధ్వంసం చేయడంతో విరిగిన వైఎస్సార్ విగ్రహం ఎడమచేయి

దుత్తలూరు: మండలంలోని వెంకటంపేటలోని దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. వైఎస్సార్ విగ్రహం ఎడమచేతిని విరగ్గొట్టారు. విగ్రహం వద్ద మద్యం బాటిళ్లు ఉండడంతో మద్యం మత్తులో కావాలనే దుశ్చర్యకు పాల్పడినట్లుగా గ్రామస్తులు భావిస్తున్నారు. కాగా వైఎస్సార్ విగ్రహ ధ్వంసానికి పాల్పడిన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

21 నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

నెల్లూరు (టౌన్): స్థానిక వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 21 నుంచి 28వ తేదీ వరకు పాలిసెట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ రామారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు ఆప్షన్ల నమోదు, జూలై 1న ఆప్షన్లలో మార్పులు, చేర్పులు, 3న సీట్ల కేటాయింపు ప్రక్రియ ఉంటుందని వివరించారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు పదో తరగతి ఉత్తీర్ణత సర్టిఫికెట్, టీసీ, ఆన్‌లైన్‌లో చెల్లించిన ఫీజు రసీదు, 4 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ పత్రాలను తీసుకురావాలని సూచించారు.

నేడు పెంచలకోనలో మెగా యోగాంధ్ర

నెల్లూరు (టౌన్): పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పెంచలకోన క్షేత్రంలో సోమవారం మెగా యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని నాలుగు పర్యాటక ప్రాంతాల్లో మెగా యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే నెల్లూరు, మైపాడుబీచ్, ఉదయగిరిలో యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహించామని తెలిపారు. ఉదయం 7 గంటలకు పెంచలకోనలో నిర్వహించే మెగా యోగాంధ్ర కార్యక్రమంలో అధికారులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

తల్లులకు నారా పోటు

తల్లికి వందనం పథకానికి రకరకాల కొర్రీలు

- 1 నుంచి ఇంటర్ వరకు 4.51 లక్షల మంది విద్యార్థులు
- జిల్లా వ్యాప్తంగా 2.42 లక్షల వరకు అర్హులు
- అనర్హుల జాబితాలోకి లక్షలాది పేద విద్యార్థులు
- ఒక్కొక్కరికి రూ.15వేలు ఇస్తామని హామీ
- కానీ విద్యార్థి తల్లి అకౌంట్‌లో రూ.13 వేలే జమ
- స్కూల్ మెయింటెనెన్స్ పేరుతో రూ.2వేలు ఎగవేత
- సచివాలయాల చుట్టూ తల్లిదండ్రుల ప్రదక్షిణలు





ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. అధికారంలోకి వచ్చేందుకు అమలు కాని హామీలు ఇచ్చి.. అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్కొక్క హామీని తుంగలో తొక్కుతోంది. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా తల్లికి వందనం పథకాన్ని ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి వర్తింపజేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన ఏడాది తరువాత ఆ పథకాన్ని తెరపైకి తెచ్చింది. ఈ పథకానికి వీలైనంత మంది విద్యార్థులను తగ్గించేందుకు రకరకాల నిబంధనలు అమలులోకి తెచ్చింది. దీంతో జిల్లా వ్యాప్తంగా లక్ష మందికి పైగా పేద విద్యార్థులను అనర్హుల జాబితాలో చేర్చినట్లు విమర్శలు వస్తున్నాయి.

నెల్లూరు (టౌన్): జిల్లా వ్యాప్తంగా 3,453 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు దాదాపు 3.92 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. అదే విధంగా ఇంటర్మీడియట్‌కు సంబంధించి ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 59 వేల మంది ఉన్నారు. మొత్తం దాదాపు 4.51 లక్షల మంది ఉన్నారు. కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తామని చెప్పింది. అధికారంలోకి వచ్చిన వెంటనే ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఒక్కొక్కరికి రూ.15వేలు తల్లి అకౌంట్‌లో జమ చేయనున్నట్లు ప్రకటించారు. అయితే ఈ పథకానికి విద్యార్థుల సంఖ్య తగ్గించుకునేందుకు రకరకాల నిబంధనలు ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. నెలకు 300 యూనిట్లు విద్యుత్తు వినియోగం, సొంతకారు ఉన్నా, కుటుంబ ఇన్‌కం పట్టణాల్లో నెలకు రూ.12వేలు, గ్రామాల్లో రూ.10 వేలు, మాగాణి 3 ఎకరాలు, మెట్ట 10 ఎకరాలు మించకూడదని, పట్టణాల్లో 1000 చదరపు అడుగులు మించి స్థలం ఉండకూడదని, ఇన్‌కం టాక్స్ చెల్లించినా, పాఠశాలలో హాజరు 75 శాతం ఉండాలని తదితర నిబంధనలను కూటమి ప్రభుత్వం తెరపైకి తెచ్చింది.

2.40 లక్షల మందికే తల్లికి వందనం

ఎన్నికల్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమంది పిల్లలకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తేమని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ లెక్కన జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో 1 నుంచి ఇంటర్మీడియట్ వరకు సుమారు 4.51 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇప్పటికే వార్డు, గ్రామ సచివాలయాల్లో అర్హుల, అనర్హుల జాబితాను ప్రదర్శిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 2.42 లక్షల మంది విద్యార్థులకే తల్లికి వందనం అమలు చేస్తున్నట్లు లెక్కలు చెబుతున్నారు. వీరికే అకౌంట్లలో డబ్బులను జమ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిబంధనల కారణంగా దాదాపు మరో లక్ష మందికి పైగా పేద విద్యార్థులు ఈ పథకానికి దూరం అవుతున్నారని తెలుస్తోంది. అర్హులై ఉండి అనర్హుల జాబితాలో పేరు ఉంటే అందుకు సంబంధించిన పత్రాలను ఈనెలాఖరులోగా అప్‌లోడ్ చేయాలని సూచిస్తున్నారు.

అకౌంట్‌లో రూ.13వేలు జమ

తల్లికి వందనం పథకానికి సంబంధించి ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని ప్రకటించారు. అయితే రూ.13 వేలు మాత్రమే జమ చేస్తున్నారు. మిగిలిన రూ.2వేలు స్కూల్ మెయింటెనెన్స్‌కు కట్ చేశారని చెబుతున్నారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.1000 తగ్గించి మిగిలిన రూ.14వేలు అకౌంట్‌లో జమ చేస్తే అప్పుడు చంద్రబాబునాయుడు, లోకేశ్ గగ్గోలు పెట్టారు. ఇప్పుడు ఒక్కో విద్యార్థి నుంచి రూ.2వేలు ఎందుకు తీసుకుంటున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. నిబంధనల పేరుతో కొంతమందికే డబ్బులు జమచేసి మిగిలిన వారికి మొండి చేయి చూపారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన అమ్మ ఒడి నగదు

సంవత్సరం	విద్యార్థులు	నగదు (కోట్లలో)
2020	2,51,811	రూ.377.71
2021	4,07,272	రూ.610.90
2022	2,31,816	రూ.347.79
2023	2,26,205	రూ.339.30

ఈ నెలాఖరులోపు పత్రాలు అప్‌లోడ్ చేయాలి

తల్లికి వందనం పథకంలో భాగంగా అర్హులు, అనర్హుల జాబితాను ఆయా సచివాలయాల్లో ప్రదర్శించారు. అనర్హుల జాబితాలో ఉన్న వారు ఎందుకు అలా ప్రకటించారో పక్కన కారణాన్ని స్పష్టంగా చూపించారు. అర్హులై ఉండి అన్ని పత్రాలు అప్‌లోడ్ చేయని వారు ఈ నెలాఖరు లోపు ఆ పత్రాలను సచివాలయంలో అప్‌లోడ్ చేస్తే వారికి కూడా వారి అకౌంటులో డబ్బులు జమ చేస్తారు.

– బాలాజీరావు, డీఈఓ

ముగిసిన ఎస్జీటీల బదిలీలు

నెల్లూరు (టౌన్): ఉపాధ్యాయ బదిలీలు ఆదివారంతో ముగిశాయి. తొలుత హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్ల బదిలీలు చేపట్టారు. ఆ ప్రక్రియ ముగిసిన తరువాత ఎస్జీటీల బదిలీలకు ఆఫ్‌లైన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ గత నెల 21వ తేదీ నుంచి ప్రారంభమైంది. తొలుత ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ప్రధానోపాధ్యాయులను బదిలీ చేశారు. అలాగే రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ప్రధానోపాధ్యాయులు కూడా రిక్వెస్ట్ బదిలీకి దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 93 మంది హెచ్‌ఎంలు బదిలీ అయ్యారు. ఆ తరువాత స్కూల్ అసిస్టెంట్ల ప్రక్రియ మొదలైంది. జిల్లా వ్యాప్తంగా స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించి లాంగ్వేజి 545, నాన్ లాంగ్వేజి 1234 మంది కలిపి మొత్తం 1779 మంది బదిలీ అయ్యారు. లాంగ్వేజి పండిట్లు 84 మంది బదిలీ అయ్యారు. 54 మంది ఉర్దూ టీచర్లు బదిలీ అయ్యారు. సెకండరీ గ్రేడ్ టీచర్లకు ఆఫ్‌లైన్‌లో కౌన్సెలింగ్ ప్రక్రియ ఈ నెల 11వ తేదీ నుంచి ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా 2074 మంది ఎస్జీటీలను బదిలీ చేశారు. ఇప్పటికే హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు బదిలీ అయిన పాఠశాలల్లో చేరారు. తాజాగా ఎస్జీటీలకు బదిలీ ఆర్డర్లను సోమవారం ఇవ్వనున్నారు. బదిలీ ఆర్డర్లు అందిన వెంటనే పాత ప్రాంతాల్లో రిలీవ్ అయి కొత్త పాఠశాలల్లో చేరాలని జిల్లా విద్యాశాఖాధికారులు ఆదేశాలు జారీ చేశారు. కాగా ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 50 శాతం ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఉండాలి. ఒకవేళ ఉపాధ్యాయులు బదిలీ అయినా పాత పాఠశాలలో 50 శాతం కంటే తక్కువ ఉంటే కొత్త పాఠశాలలో జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చి పాతచోటే విధులు నిర్వహించాల్సి ఉంటుంది. డీఎస్సీ కొత్త ఉపాధ్యాయులు వచ్చే వరకు వీరు బోధన చేయాల్సి ఉంటుంది. దీంతో పాటు బదిలీల్లో నష్టపోయామని ఏ ఉపాధ్యాయుడైనా భావిస్తే మూడు రోజుల్లోపు డీఈఓ దగ్గర ఉన్న గ్రీవెన్స్ కమిటీకి ఫిర్యాదు చేయాలి. ఈ కమిటీ పదిహేను రోజుల్లో వారికి రాతపూర్వకంగా సమాధానం ఇస్తుంది. దీనిపై సంతృప్తి చెందని ఉపాధ్యాయులు ఇదే తరహాలో ఆర్జేడీ, విద్యాశాఖ కమిషనర్, ఆ తరువాత కోర్టును ఆశ్రయించేందుకు వీలుంది.

జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం



జగన్ అంటే నమ్మకం-చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, మేరిగ మురళి, తదితరులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం అనే విషయం రాష్ట్ర ప్రజలకు పూర్తిగా అర్థమైందని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. 'జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం' పుస్తకాన్ని నగరంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీలు మేరిగ మురళి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆనం అరుణమ్మ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతున్న ప్రతిపక్ష నేతలపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టడం సరికాదన్నారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాల పేరుతో రాష్ట్రంలోని ఐదు కోట్ల ప్రజలను చంద్రబాబు మోసం చేశారన్నారు. వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్‌గా చంద్రబాబు పాలన ఉందన్నారు. అధికారంలోకి వచ్చేందుకు 143 హామీలను ఇచ్చి వాటిని అమలు చేయకుండా ప్రజలను నిలువునా దగా చేశారని మండిపడ్డారు. జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న పోరాటాల ఫలితంగా చంద్రబాబు తూతూ మంత్రంగా ఒకటిరెండు పథకాలను అమలు చేసి చేతులు దులుపుకోవాలని చూస్తున్నారన్నారు. ఉచిత గ్యాస్ సిలెండర్, తల్లికి వందనం పథకాల్లో పారదర్శకత లోపించిందన్నారు. ఓటు వేసిన ప్రజలను కించపరిచేలా వారి నాలుక కోస్తామని చంద్రబాబు మాట్లాడాన్ని వారు అసహ్యంచుకుంటున్నారని అన్నారు. 18 నుంచి 59ఏళ్ల లోపు మహిళలు ఆడబిడ్డ నిధి పథకాన్ని అమలు చేయమని కోరుతుంటే ఇవ్వకుండా పీ-4తో అనుసంధానం చేస్తామని కబుర్లు చెప్పడంపై మండిపడ్డారు. నిరుద్యోగభృతిని పీ-4కు అనుసంధానం చేస్తామని యువతను మభ్యపెట్టడం దారుణమన్నారు. 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు పింఛన్ అమలు ఊసే లేదన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను మరిచి ప్రజలను దగా చేస్తున్న క్రమంలో జగన్ అంటే నమ్మకం-చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని ఆవిష్కరించామన్నారు. ఈ పుస్తకం చంద్రబాబు పాలనను గుర్తుచేస్తుందన్నారు. ఎమ్మెల్సీ మేరిగ మురళి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల పక్షాన నిలిచి చేస్తున్న పోరాటాలకు భయపడిన చంద్రబాబునాయుడు తల్లికి వందనం పథకాన్ని తూతూ మంత్రంగా అమలు చేశారన్నారు. పూర్తిస్థాయిలో లబ్ధిదారులందరికీ తల్లికి వందనం అందకపోవడం బాబు మోసపూరిత శైలికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ ప్రతిపక్ష నేతలపై ఇష్టానుసారంగా కేసులు పెట్టడాన్ని సైతం ప్రజలు గమనిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, ఏఎంసీ మాజీ చైర్మన్ కోటేశ్వరరెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు ఆశ్రిత్‌రెడ్డి, సీనియర్ నాయకులు దాసరి భాస్కర్‌గౌడ్, సాయిమోహన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నకిలీ ఇళ్ల పట్టాల కలకలం

- సీతారామపురంలో 40 మందికి పంపిణీ
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వైనం

సీతారామపురం: ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములపై కన్నేసిన కొందరు వాటికి నకిలీ పత్రాలు సృష్టించి అమాయకులకు అంటగడుతున్న వైనం సీతారామపురంలో వెలుగులోకొచ్చింది. గ్రామంలోని సర్వే నంబర్ 240లోని ప్రభుత్వ భూమికి ఓ ప్రబుద్ధుడు నకిలీ నివేశన పట్టాలు సృష్టించి అమాయకులకు అంటగట్టాడు. ఒక్కొక్కరికీ 3 సెంట్లు చొప్పున 40 మందికి నివేశన పట్టాలను తయారు చేసి ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.25 వేలు చొప్పున వసూలు చేసినట్లు తెలిసింది. ఇలా పలువురి నుంచి అతను సుమారు రూ.10 లక్షల మేరకు వసూలు చేసినట్లు సమాచారం. ఇంటి నివేశన పత్రం ఉదయగిరి మండలానికి సంబంధించినది కాగా,ఆ పత్రంపై వీఆర్వో, ఆర్ఐ, తహసీల్దార్ల సంతకాలు ఫోర్జరీ చేసి ఉన్నాయి. స్టాంపులు మాత్రం సీతారామపురం తహసీల్దార్ కార్యాలయానివి వేసి ఉన్నారు. నకిలీ పట్టాల విషయం ఆదివారం సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. దీంతో నివేశన పట్టాలు నకిలీవని తెలుసుకున్న పలువురు బాధితులు సదరు వ్యక్తిని నిలదీయగా పట్టా కాగితాలు తిరిగి ఇచ్చేయండి, మీ నగదు మీకు చెల్లిస్తానంటూ బుకాయిస్తున్నట్లు సమాచారం. మండలంలో ఇలాంటి మాయగాళ్లు నిత్యం మండల తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ వారి దర్పాన్ని ప్రదర్శిస్తూ రెవెన్యూ సిబ్బందిని ప్రలోభాలకు గురిచేసి ఈ తతంగం సాగిస్తున్నట్లుగా ఆరోపణలున్నాయి. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు, పోలీసులు ఈ నకిలీ పట్టాలపై నిగ్గుతేలిస్తే మాయగాళ్ల లీలలు మరెన్నో బయటకు వచ్చే అవకాశం ఉంది.



సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్న నకిలీ పట్టా



వడ్డిపాళెంలో పసుపు దంచుతున్న మహిళా భక్తులు

వైభవంగా వెంగమాంబ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- భక్తిశ్రద్ధలతో నిలుపు కార్యక్రమం
- పసుపు దంచేందుకు పోటీపడిన ముత్తైదువులు

దుత్తలూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన నర్రవాడ వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలు ఆదివారం నిలుపు కార్యక్రమంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు వేదపండితులు వెంగమాంబ, గురవయ్య దంపతులను పూలతో విశేషంగా అలంకరించి గణపతిపూజ, సహస్రనామార్చన, కుంకుమార్చన, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు నవగ్రహ పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం కలశపూజ నిర్వహించారు. తొలిరోజు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు సంతానం కోసం అమ్మవారి వద్ద వరపడ్డారు.

అట్టహాసంగా నిలుపు

వెంగమాంబ పుట్టినిల్లు వడ్డిపాళెంలోని దేవర ఇంట్లో ఆదివారం రాత్రి నిలుపు కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఉదయం రేణుకా ఎల్లమ్మ గుడిలో గణపతిపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, వెంగమాంబ, రేణుకా ఎల్లమ్మకు పంచామృతాభిషేకం నిర్వహించారు. రాత్రి పచ్చవ వంశస్తులు పసుపు దంచే కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. వెంగమాంబ ఉత్సవాల్లో పసుపు దంచితే సకల శుభాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా తరలివచ్చిన ముత్తైదువులు పసుపు దంచేందుకు పోటీపడ్డారు. అనంతరం పసుపు, కుంకుమను అమ్మవారి దేవస్థానం వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు.



విశేషాలంకారంలో వెంగమాంబ అమ్మవారు

ఉదయగిరి దుర్గంపై కూంబింగ్

ఉదయగిరి: ఉదయగిరి అటవీ రేంజ్ పరిధిలో ఉన్న ఉదయగిరి దుర్గంపై ఆదివారం అటవీ శాఖ సిబ్బంది కూంబింగ్ నిర్వహించారు. శనివారం రాత్రి దుర్గంపై ఉన్న పెద్దమసీదు ప్రాంతంలో దీపాలు వెలుగుతూ కనిపించడంతో గుప్తనిధుల ముఠా సంచరిస్తుందనే అనుమానంతో కూంబింగ్ చేపట్టారు. స్థానిక అటవీ శాఖ అధికారులతో పాటు స్ట్రైకింగ్ ఫోర్స్ కలిసి దుర్గంపైకి వెళ్లారు. చిన్నమసీదు, పెద్ద మసీదు, గుర్రపుశాలలు, మెట్ల మార్గం తదితర ప్రాంతాలలో పరిశీలన జరిపారు. ఎలాంటి తవ్వకాలు జరిపిన ఆనవాళ్లు లేవని అటవీ సిబ్బంది తెలిపారు. కాగా స్థానికులు కొందరు దుర్గంపైన ఉన్న పెద్దమసీదు వద్ద శనివారం రాత్రి లైట్లు ఏర్పాటు చేసి విందు భోజనాలు చేసినట్లుగా తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.



దుర్గంపై పరిశీలిస్తున్న అటవీశాఖ సిబ్బంది

క్లుప్తంగా

మోటార్‌బైక్ దగ్ధం



కాలిపోతున్న వాహనం

కలువాయి(సైదాపురం): మండల కేంద్రమైన కలువాయి బస్టాండ్ సెంటర్‌లో సీఎస్‌సీ సెంటర్ నిర్వహిస్తున్న కరిముల్లా అనే వ్యక్తి మోటార్‌బైక్ ఆదివారం దగ్ధమైంది. వాహనం నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో గమనించిన స్థానికులు ఆర్పేందుకు యత్నించారు. అయితే అప్పటికే బైక్ కాలిపోయింది.

ఆదివారం కదా.. అందుకే రాలేదు!



తాళం వేసిన మెడికల్ ఆఫీసర్ గది

ఉదయగిరి: ఉదయగిరి మండలం గండిపాళెంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం ఒక్క స్టాఫ్ నర్సు మినహా మిగతా సిబ్బంది ఎవరూ లేరు. ఈ పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యాధికారులు ఉండగా ఒక్కరు కూడా విధులకు హాజరుకాలేదు. ల్యాబ్ టెక్నీషియన్‌ది కూడా ఇదే పరిస్థితి. దీంతో మెడికల్ ఆఫీసర్, ల్యాబ్ గదుల తలుపులు తెరుచుకోలేదు. ఒక్క స్టాఫ్‌నర్సు మాత్రమే విధుల్లో ఉండి వచ్చిన రోగులకు మందులిచ్చి పంపించారు. ఆదివారం వచ్చిందంటే గండిపాళెం పీహెచ్‌సీకి సెలవే. ఇది 24 గంటలు పని చేయాల్సిన ఆస్పత్రి. అయితే ఆరోజు వైద్యులు, ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండరు. దీంతో పలువురు రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు.

కసుమూరు దర్గాలో నటుడు అలీ ప్రార్థనలు



అలీకి స్వాగతం పలుకుతున్న ముజావర్లు

వెంకటాచలం: సినీ నటుడు అలీ తన కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం కసుమూరు దర్గాను సందర్శించారు. ఈ సందర్భంగా దర్గా ముజావర్లు ఘన స్వాగతం పలికారు. అలీ కుటుంబం ప్రత్యేక ప్రార్థనలు చేసింది.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

గూడూరు రూరల్: గూడూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు దీపిక, కౌసల్య జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు మాధవీలక్ష్మి తెలిపారు. ఆదివారం వివరాలు వెల్లడించారు. బాలికలు కాకినాడలో ఈనెల 12 నుంచి 15వ తేదీ వరకు జరిగిన కబడ్డీ ఫెడరేషన్ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపికైనట్టు పేర్కొన్నారు. వీరు రాజస్థాన్‌లో జూలై 10 నుంచి 13వ తేదీ వరకు జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆమె, పీడీ విజయలక్ష్మి, విద్యార్థినులను అభినందించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు

పెళ్లకూరు: మండలంలో ఆదివారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. విజయవాడకు చెందిన మధుసూదన్ రెడ్డి, కుటుంబ సభ్యులు తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లారు. ఆదివారం తిరుగు ప్రయాణమయ్యారు. పెళ్లకూరు మండలం పెన్నేపల్లి వద్ద కారు అదుపుతప్పి ఐరన్ డివైడర్‌ను ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్న తొమ్మిది మందిలో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. అలాగే తిరుపతి నుంచి నెల్లూరుకు సిమెంట్ లోడుతో వెళుతున్న లారీ చిల్లకూరు వడ్డిపాళెం వద్ద డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. డ్రైవర్‌కు గాయాలయ్యాయి. వారిని స్థానికులు నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కండలేరులో 36.955 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 36.955 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఇన్‌చార్జి ఈఈ రామచంద్రమూర్తి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 2,480, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 50, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.32
సన్నవి : రూ.25
పండ్లు : రూ.10

అవును.. అతను కుర్చీ వదలడు

11 ఏళ్లుగా ఒకే సీటులో సీనియర్ అసిస్టెంట్

- నెల్లూరులోనే 30 ఏళ్లుగా విధులు
- అధికార పార్టీ అండదండలతోనే..
- ఆరోపణలు వెల్లువెత్తుతున్నా సీటు మార్చని అధికారులు
- నేటి నుంచి పెద్దాస్పత్రి, మెడికల్ కళాశాలలో బదిలీల ప్రక్రియ



ప్రభుత్వ పెద్దాస్పత్రి



నెల్లూరు(అర్బన్): జిల్లా వైద్యశాఖలో ఇప్పటికే సాధారణ బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. ఇందులో అధికార పార్టీ నేతల సిఫార్సులకు ప్రాధాన్యత కల్పిస్తున్నారనే ఆరోపణలున్నాయి. సోమవారం నుంచి జిల్లా సర్వజన ఆస్పత్రి (పెద్దాస్పత్రి), ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ప్రక్రియ ప్రారంభమవుతోంది. అయితే ఒకరిద్దరు ఏళ్ల తరబడి తమ సీటు వదలడం లేదు. అధికారులు వారిని బదిలీ చేయలేకపోతున్నారు. ఉదాహరణకు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో 11 ఏళ్లుగా ఓ సీనియర్ అసిస్టెంట్ సీటుకు అతుక్కుపోయారు. అధికార పార్టీ అండదండలు, లంచాలతో అక్కడే విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయన తన ఉద్యోగకాలంలో గతంలో నగరంలోని టీబీ ఆస్పత్రిలో 20 ఏళ్లు పనిచేశాడు. టీబీ ఆస్పత్రిని పెద్దాస్పత్రిలో కలిపేశాక 11 ఏళ్లుగా ఇక్కడే పనిచేస్తున్నాడు. అంటే తన సర్వీసులో నెల్లూరును వదిలి పెట్టలేదు.

ఆరోపణలెన్నో..

ప్రభుత్వాస్పత్రిలో పేరుకే సీనియర్ అసిస్టెంట్. అయితే మొత్తం పనులన్నీ ఆయనే చక్కబెడుతున్నాడనే ఆరోపణలున్నాయి. ఆఫీసులో ఏ ఫైలు కదలాలన్నా ముందుగా ఆ సీనియర్ అసిస్టెంట్ చేయి తడపందే పనులు కావనే ఆరోపణలున్నాయి. లంచాలిస్తే ఆ ఫైల్‌కు తక్కువ సమయంలోనే మోక్షం కలుగుతుంది. లేకుంటే ఇబ్బంది పెడుతారనే విమర్శలున్నాయి. మెడికల్ బిల్లులు, ఉద్యోగులకు మెడికల్ సర్టిఫికెట్లు డబ్బులిస్తే చేస్తారనే ప్రచారం ఉంది. అంతేకాకుండా సొంత స్టాఫ్ విషయంలో, డాక్టర్ల విషయంలో పనులు జరగవనే ప్రచారం ఉంది.

లేఖ తెచ్చుకుని..

ఆ సీనియర్ అసిస్టెంట్ తనను బదిలీ చేయకుండా అసోసియేషన్ తరఫున సిఫార్సు లేఖ తెచ్చుకున్నారు. ప్రస్తుతం జీఓ ప్రకారం అది పనికి రాదు. అయినా దానిని అడ్డుపెట్టుకుని, అధికార పార్టీ నాయకుల అండతో కదిలేందుకు సిద్ధపడటం లేదు. అధికారులు కనీసం సీటు కూడా మార్చడం లేదు. ఇలాంటి లోపాలతో ఉన్న వారిని మార్చకుండా ఎలా పారదర్శకంగా బదిలీలు చేస్తారో వేచి చూడాల్సిందే.

అంతా నా ఇష్టం

- ఆస్పత్రిలో పనిచేసే సుమారు 20 మంది స్టాఫ్ నర్సులు ఆపరేషన్లలో పాల్గొన్నందుకు ఆరోగ్యశ్రీ కింద రూ.4 వేల నుంచి రూ.7 వేలు వరకు ఒక్కొక్కరికి 2023లో ఇన్సెంటివ్స్ రావాలి. ఆ నిధులను నర్సుల బ్యాంక్ ఖాతాల్లో వేశామని ఆ సీనియర్ అసిస్టెంట్ చెబుతున్నారు. బ్యాంక్ వారు తమకు వేయలేదని అంటున్నారు. మరి ఆ డబ్బులు ఎవరు తిన్నారో తెలియదు. బ్యాంకు ఖాతాకు జమ చేసి ఫెయిలైతే అకౌంట్ వివరాలు తీసుకుంటే సరిపోతుంది. అది కూడా చేయలేదు. నాలుగు నెలల నుంచి నర్సులు తమకు సంబంధించిన నగదు గురించి అడుగుతున్నా సమాధానం లేదు.
- గతంలో బినామీ ఏజెన్సీ పేరుతో ఇంటర్నెట్ బిల్లులు భారీగా చెల్లించారనే ఆరోపణలున్నాయి.
- ఒకటికి మూడు కంపెనీల సెల్ టవర్లు ఆస్పత్రి ఆవరణలో ఉన్నాయి. ఏళ్ల తరబడి వాటికి ఆయా కంపెనీలు ఒక్క రూపాయి అద్దె చెల్లించలేదు. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు నాటి ఆస్పత్రి అభివృద్ధి కమిటీ కో–ఆర్డినేటర్ లక్ష్మీ సునంద ఈ విషయమై పోరాడి కొంతవరకు సెల్‌టవర్ కంపెనీల నుంచి అద్దెలు వసూలు చేయించారు. అధికారం మారాక బ్యాలెన్స్ డబ్బులు నేటికీ జమ కాలేదు.
- తనకు లంచం ఇవ్వకపోయినా.. తనకు నచ్చకపోయినా ఆ సీనియర్ అసిస్టెంట్ తీవ్ర ఇబ్బందులు పెడతారు. అందులో భాగంగా సూపరింటెండెంట్‌కు కారు అద్దెకు పెట్టిన కాంట్రాక్టర్‌కు 9 నెలలుగా అద్దె చెల్లించలేదు. దీంతో అతను కలెక్టర్‌కు అర్జీ పెట్టారు. దీంతో కాంట్రాక్టర్‌కు ఇచ్చిన చెక్కులో అంకెలు కరెక్ట్‌గా వేసి అక్షరాల్లో ఒకచోట తప్పు రాశారు. ఆ చెక్కును బ్యాంక్‌లో జమ చేయగా చెల్లలేదు. మళ్లీ కాంట్రాక్టర్ విషయం తెలుసుకుని చెక్కును తెచ్చి ఆ సీనియర్ అసిస్టెంట్‌కు ఇచ్చి సరి చేయమని కోరారు. ఇందుకు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ కూడా త్వరగా లోపాన్ని సరి చేయమని పదేపదే చెప్పినా ఆ సీనియర్ అసిస్టెంట్ కాంట్రాక్టర్‌ను ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఆఫీసులో కూర్చోబెట్టుకున్నాడు. తీరా రిజిస్టర్ కనబడలేదు. సంతకం చేయాలి. రేపు రావాలని చెప్పాడు. దీంతో కాంట్రాక్టర్ అక్కడి నుంచి కదలకపోవడంతో సాయంత్రం 6 గంటలకు చెక్కు ఇచ్చారు.
- ఆరోగ్యశ్రీకి సంబంధించిన రెండు చెక్కుల్లో కూడా ఇలాగే అంకెలు కరెక్ట్‌గా వేసి, అక్షరాల్లో మధ్యలో ఒకచోట తప్పు రాశాడు. ఇలాంటివి అనేకం ఉన్నాయి. అయినా ఆయన్ను అక్కడి నుంచి కదిలించేందుకు అధికారులు సిద్ధపడటం లేదు.

స్వర్ణాల చెరువు ఆక్రమణకు యత్నం

- రంగంలోకి టీడీపీ నేత
- జేసీబీతో పిచ్చిమొక్కల తొలగింపు
- చోద్యం చూస్తున్న ఇరిగేషన్ అధికారులు



చెరువు స్థలంలో పిచ్చి మొక్కలు తొలగిస్తున్న జేసీబీ

నెల్లూరు సిటీ: స్వర్ణాల చెరువుపై తెలుగు తమ్ముళ్ల కళ్లు పడ్డాయి. నెల్లూరులో ప్రతిష్టాత్మకమైన ఈ చెరువు స్థలాన్ని ఆక్రమిస్తున్నారు. ఈ విషయం ఇరిగేషన్ అధికారులకు తెలిసినా అధికార పార్టీ నేతలు కావడంతో మిన్నకుండిపోయారని విమర్శలున్నాయి. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 34వ డివిజన్‌లో ప్రగతినగర్ ఏబ్లాక్ 10వ వీధి చివర స్వర్ణాల చెరువు విస్తరించి ఉంది. దాదాపు 400 అంకణాల చెరువు స్థలాన్ని ఆక్రమించేందుకు టీడీపీ నేత రంగం సిద్ధం చేశారు. అందులో భాగంగా రెండు రోజుల నుంచి 100 అంకణాల స్థలంలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్నారు. మట్టి తోలించి చదును చేయిస్తున్నారు.

ఇష్టారాజ్యంగా..

జేసీబీతో చదును చేస్తున్న వారిని స్థానికులు ప్రశ్నించగా మా ఇష్టం వచ్చినట్లు చేసుకుంటామని, టీడీపీ ముఖ్య నేతల అండదండలు పుష్కలంగా ఉన్నాయని సమాధానమిచ్చారు. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండని సదరు నేత ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

ప్లాట్లు చేసి విక్రయాలు

చెరువు స్థలాన్ని చదును చేసి 9 అంకణాల లెక్కన ప్లాట్లుగా వేసి విక్రయాలు చేసేందుకు టీడీపీ నేత స్కెచ్ వేశారని ప్రచారం ఉంది. అధికార పార్టీ కావడంతో అడిగేవారు లేరని బరితెగిస్తున్నట్లు స్థానికులు వాపోతున్నారు.

ఆరోగ్య రంగం నిర్వీర్యం



మాట్లాడుతున్న డాక్టర్ విరించి

నెల్లూరు(అర్బన్): ప్రస్తుత ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య రంగాన్ని నిర్వీర్యం చేస్తోందని హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రముఖ డాక్టర్ విరించి అన్నారు. నెల్లూరు హరనాథపురంలోని డాక్టర్ జేఎస్ విజ్ఞాన కేంద్రంలో డాక్టర్ జెట్టి శేషారెడ్డి 17వ స్మారక సదస్సు ఆదివారం జరిగింది. జనవిజ్ఞానవేదిక, డాక్టర్ రామచంద్రారెడ్డి ఆస్పత్రి, ప్రజారోగ్యవేదిక, మెడికల్ రెప్స్ యూనియన్, యూటీఎఫ్, యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ – పర్యవసానాలు అనే అంశంపై విరించి మాట్లాడారు. పేదలు ప్రభుత్వాస్పత్రులకు వెళ్లలేని పరిస్థితులను ప్రభుత్వం కల్పిస్తోందని విమర్శించారు. ఇప్పుడు రాష్ట్రంలో కొత్తగా తెస్తున్న 12 వైద్య కళాశాలలను పీపీపీ మోడ్‌లో ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తామని బహిరంగంగా ప్రభుత్వం చెప్పడం సిగ్గు చేటన్నారు. ఇదే జరిగితే సామాన్య పిల్లలు వైద్యవిద్యను ఎక్కడ అభ్యసించాలని ప్రశ్నించారు.

- భారత రాజ్యాంగం పూర్వాపరాలు, సవాళ్లు అనే అంశంపై మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ పాలకులు రాజ్యాంగ మూలస్తంభాలపైనే దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తమ స్వార్థం కోసం ఎలక్షన్ కమిషన్, ఈడీ, ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్, సీబీఐలను దుర్వినియోగం చేస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మతం పేరుతో ప్రజల్లో అసమానతలు పెంచుతూ తమ అధికారాన్ని కాపాడుకుంటున్నాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రామచంద్రారెడ్డి వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రాజేశ్వరరావు, డాక్టర్ రమణయ్య, సతీష్, మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రొట్టెల పండగకు విస్తృత ఏర్పాట్లు

- మంత్రి నారాయణ



మాట్లాడుతున్న మంత్రి నారాయణ

నెల్లూరు(టౌన్): రొట్టెల పండగకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, ఎస్పీ కృష్ణకాంత్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, అధికారులతో కలిసి ఏర్పాట్లపై ఆదివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దర్గా అభివృద్ధికి సీఎం రూ.5 కోట్లు మంజూరు చేశారన్నారు. 20 వేల మంది భక్తులు ఒకేచోట ప్రార్థన చేసేందుకు వీలుగా మందిరాన్ని నిధులతో నిర్మిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా నుడా ఆధ్వర్యంలో ఈ నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. నగరంలో అండర్‌పాస్‌లు, ఓవర్ బ్రిడ్జిల వద్ద, ఓవర్ హెడ్ ట్యాంకులు వద్ద పెయింటింగ్ పనులు సంవత్సర కాలంగా కొనసాగుతుండటంపై సంబంధిత అధికారులు, పెయింటింగ్ కాంట్రాక్టర్లపై మండిపడ్డారు. 45 రోజుల్లో అన్ని ప్రాంతాల్లో పెయింటింగ్ పనులు పూర్తి చేయాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



ఘటనా స్థలంలో శ్రీనివాసులు

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలో నెల్లూరు – ముంబై రహదారి నుంచి ఏఎస్‌పేట అడ్డరోడ్డుకు మలుపు తిరుగుతున్న కారును ఆత్మకూరు నుంచి నెల్లూరు మార్గంలో వెళ్తున్న టీవీఎస్ ఎక్సెల్ వేగంగా ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై ఎస్‌కే జిలానీ, ఏఎస్సై శ్రీనివాసులురెడ్డి కథనం మేరకు.. తెలంగాణకు చెందిన ఓ కుటుంబం కారులో నెల్లూరు నుంచి ఏఎస్‌పేట దర్గా వద్దకు వస్తోంది. అదే క్రమంలో ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని వెంకట్రావుపల్లి గిరిజనకాలనీకి చెందిన పెంచలయ్య, యాకసిరి శ్రీనివాసులు అనే ఇద్దరు వ్యక్తులు టీవీఎస్ ఎక్సెల్‌పై వేగంగా వస్తూ మలుపు తిరుగుతున్న కారును ఢీకొట్టారు. దీంతో పెంచలయ్య ఎగిరి రోడ్డుపై పడ్డాడు. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లినట్లు ఎస్సై జిలానీ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మామిడికి పురుగుపోటు

ఉలవపాడు మామిడికి ఎంతో పేరుంది. దీనిని ఇష్టంగా తినేవారు ఎందరో ఉన్నారు. స్థానికంగా ఉండే వారు బంధుమిత్రులకు పంపుతుంటారు. అయితే పురుగుల వల్ల ప్రస్తుతం కాయలపై అయిష్టత ఏర్పడుతోందని ప్రజలు వాపోతున్నారు.

- ఉలవపాడు ఫలరాజుకు పండుఈగ కష్టాలు
- వర్షాల వల్లే ఈ పరిస్థితి
- 30 శాతం తోటల్లో అంతే..



మామిడిలో వస్తున్న పురుగులు



కవర్ కట్టిన తర్వాత..



కోసిన తర్వాత ఇలా..



కవర్ కట్టిన కాయల నాణ్యత ఇలా..

ఉలవపాడు: ఫలరాజుకు పురుగు పట్టింది. దీంతో ఎంతో ఇష్టంగా తినే ఉలవపాడు మామిడి ప్రస్తుతం ప్రజలకు చేదైంది. కోతకు వచ్చే సమయంలో వర్షాలు కురవడంతో కాయల్లో పురుగులు వచ్చాయి. గతంలోనూ పండుఈగ తాకిడి ఉండగా అది కేవలం 5 శాతంలోపే. అయితే వానల వల్ల కాయల్లో నేడు పురుగులు వస్తున్నాయి. ప్రస్తుతం సుమారు 30 శాతం తోటల్లో ఈ పరిస్థితి ఉందని రైతులు అంటున్నారు.

ఇబ్బందికరంగా..

ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన ఉలవపాడు మామిడి రుచిలో అద్భుతమని జనం చెబుతారు. చాలామంది తమ మిత్రులకు, బంధువులకు, అధికారులకు బాక్స్‌ల్లో కాయలు పంపిస్తుంటారు. ప్రస్తుతం వాటిలో పురుగులున్నాయని చెబుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. ఉలవపాడు ఉద్యాన శాఖ పరిధిలో సుమారు 10 వేల ఎకరాల్లో మామిడి సాగు జరుగుతోంది. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేని కారణంగా ఈ ఏడాది దిగుబడి తగ్గింది. తొలుత కాయల రేట్లు అధికంగా ఉన్నాయి. తర్వాత పురుగుల తాకిడి వల్ల కాస్త తగ్గాయి. ప్రస్తుతం టన్ను రూ.40 వేలు పలుకుతోంది. కానీ స్థానిక మార్కెట్లో మాత్రం కేజీ రూ.80 ఉంది. ప్రధానంగా ఇసుక నేలల్లో ఉన్న తోటలకు అధికంగా పురుగు వ్యాపించింది. ఎర్రనేలల్లో తక్కువగా ఉంది. పురుగులు తగలని తోటల్లో రేట్లు భారీగా ఉన్నాయి. పెద్ద తోటల్లో వేర్వేరు చెట్లలోని కాయలను పరిశీలిస్తున్నారు. పురుగు పట్టిందా? లేదా? అని పరిశీలించి అప్పుడు కొనుగోలు చేస్తున్నారు. ఒకవేళ పురుగు లేకపోతే అధిక రేటుకు కొంటున్నారు. పురుగు తగలని కొంత భాగం ఎర్రనేల కాయలను కొనుగోలుదారులు కేజీ రూ.100 పైనే తీసుకుంటున్నారు.

కవర్ కడితే..

పురుగుల నివారణ కోసం కవర్ కట్టిన కాయలకు ప్రస్తుతం డిమాండ్ ఉంది. రైతులు చాలా తోటల్లో కట్టారు. ఈ కాయలు నాణ్యతగా ఉంటాయి. అయితే ఎండ, వడగాలి తగలదు కాబట్టి రుచి కాస్త తక్కువగా ఉంటుంది. ఈ కాయలకు డిమాండ్ అధికంగా ఉన్నా అందరూ కొనుగోలు చేయడం లేదు. రుచి కోరుకునే వారు ఎండ తగిలే కాయలనే తీసుకుంటున్నారు. కానీ పురుగులు తగలకుండా నాణ్యమైన కాయలను కావాలనుకునే వారు మాత్రం ఈ కవర్ కట్టిన వాటిని కోరుకుంటున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంత కాయలకు పురుగులు రావడంతో కవర్ కట్టిన కాయలకు కాస్త డిమాండ్ ఉంది. కేజీ రూ.100 పైనే అమ్ముతున్నారు. టన్ను రూ.60 వేలకు ఎగుమతులు చేస్తున్నారు.